తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1985 మినీకథల పోటీలో రు. 250/-లు బహుమతి పొందిన రచన




తన నాలుగేళ్ల పాపతో ఒకావిడ బస్సులో వెళుతున్నదిట. ఉన్నట్లుండి ఆ పాప అడిగింది "అమ్మా! మన పక్కింట్లో ఉన్న పిల్లి ఆడదా మగదా?" అని. ఏదో ఒక సమాధానం చెప్పకపోతే ఇంకా విసిగిస్తుంది అని ఆ తల్లి "మగదే. కాని బస్సులో అంత గట్టిగా అరవకూడదు" అని మెల్లిగా చెప్పిందిట. "ఆ పిల్లి మగదే అని ఎలా చెప్పగలవు?" అంది ఆ చిచ్చర పిడుగు అదే గొంతుతో. అంతే! ఆ బస్సులో అందరి చెవులతో పాటు కళ్లు కూడా అటు తిరిగాయిట, ఆ చిక్కు ప్రశ్నకి ఎటువంటి సమాధానం వస్తుందో అన్న జిజ్ఞాసతో! "పిల్లికి మీసాలు ఉన్నాయి కదా మరి!" అందిట ఆ తల్లి కూల్‌గా.

మా అమ్మాయి నన్నూ సుబ్బారావుని కలిపి జాయింట్‌గా "మీ యిద్దరిలో ఎవరు బాగా చదివే వాళ్లు?" అని అడిగినప్పుడు ఆ తల్లికి ఉన్న సమయస్ఫూర్తి లేకపోవటంతో ఏం జవాబు యివ్వాలా అని తబ్బిబ్బు పడ్డాను.

సుబ్బారావు, నేను కలిసి బి. ఏ. వరకూ చదివాం. ఆ తరువాత నేను ఉద్యోగాల వేటలో హైదరాబాద్ వచ్చాను. ఉద్యోగం దొరికిన రెండేళ్లకి సీతతో నా పెళ్లి అయింది. యింకో రెండేళ్లకి లత పుట్టింది. ఆ తరువాత అయిదేళ్లకి సుబ్బారావుని కలిశాను-ఆఫీసునుండి యింటికి వస్తుంటే నా ముందు కారు ఆగింది. గంజి పెట్టిన తెల్లటి ఖద్దరు చొక్కా, నల్లటి టెరీ-వూల్ ప్యాంట్, ఆ రెండింటి మిశ్రమం లాంటి జుట్టుతో కారుదిగిన వ్యక్తిని సుబ్బారావు అని ఆనవాలు కట్టలేదు నేను. వాడే గుర్తుపట్టి కారు ఆపాడుట. ఈ పదేళ్లల్లోనూ వాడూ పదింతలు పెరిగాడు.. ఏవో కాంట్రాక్టులు.. వ్యాపారాలు.. వీడి చురుకు, చొరవ చూసి ఒకాయన పిల్లతో పాటు మీడియంసైజ్ ఫౌండ్రీ యిచ్చి పెళ్ళి చేశాడుట. అదుగో ఆ ఫౌండ్రీ చూసుకుంటూ ఏడాదిగా హైదరాబాద్‌లో ఉంటున్నాడుట. నా ఎడ్రస్ తీసుకున్నాడు వాడు. నా ఆఫీస్ ఫోన్ నంబర్ వాడి కాసియో వాచ్ మెమరీలోకి ఎక్కించాడు. వాడి కార్డు నాకు యిచ్చి "ఎవరు ముందు కలుస్తారో చూద్దాం!" అన్నాడు విడిపోయేముందు. వాడా మాట అన్నాడనే నాలుగు రోజుల తరువాత లతని తీసుకుని వాడి ఫౌండ్రీకి బయలు దేరాను.

మేం వెళ్లేటప్పటికి సుబ్బారావు షాప్ ఫ్లోర్‌లో ఉన్నాడు సూపర్‌వైజర్‌తో మాట్లాడుతూ. వాడి మాటలు వింటే నాకు ఆశ్చర్యం వేసింది—యిన్ని విషయాలు ఎప్పుడు నేర్చుకున్నాడా అని. ఆ మాటే వాడితో అంటే నవ్వేశాడు. లత ప్రశ్నలు అడగటం మొదలు పెట్టింది. సుబ్బారావు లతను ఎత్తుకుని ఫౌండ్రీ అంతా చూపించాడు. అన్నీ సవిస్తరంగా వివరించాడు. అయిపోయాక వాడి రూంలోకి వెళ్లాం. నీట్‌గా దర్జాగా ఉంది వాడి రూం. దానికి తోడు ఎయిర్ కండిషన్డు కావటంతో ఫౌండ్రీలో తిరిగి వచ్చిన మాకు ఎంతో రిలీఫ్‌గా అనిపించింది. సుబ్బారావు ఫ్రిజ్ తీసి గోల్డ్ స్పాట్ సీసాలు బయటకి తీశాడు. రెండు గుక్కలు తాగాక అడిగింది లత ఆ ప్రశ్న మీ యిద్దరిలో ఎవరు బాగా చదివేవాళ్లు?" అని. నాకు లత ఉద్దేశం ఏమిటో అర్థం అయింది. తను హోం వర్కు చేయనని మొండికేస్తుంటే నేను, సీతా చెప్పేవాళ్లం "బాగా చదువుకుంటే మంచి ఉద్యోగం చేసి బాగా డబ్బులు సంపాదించవచ్చు" అని. అందుకనే ఏం చెప్పాలో అర్థంకాక అవస్థపడ్డాను నేను. సుబ్బారావుకి అర్థం అయినట్లుంది, నవ్వేశాడు. "స్మార్ట్‌గాళ్!" అని లత బుగ్గలు నిమిరాడు. "నేను మీ నాన్న దగ్గర కాపీ కొట్టి పరీక్ష పాస్ అయ్యాను!" అని మళ్లీ నవ్వాడు. నేను నవ్వలేక నవ్వాను గాని లత మా యిద్దరి మధ్య ఉన్న అంతరాన్ని గమనించిందన్న అభిమానం, వాడు లోలోపల ఏమన్నా అనుకున్నాడా అన్న సంకోచం నన్ను ఆ తరువాత ముభావంగా ఉంచాయి. అందుకనే అనుకున్న దానికంటే ముందుగానే యింటికి బయల్దేరాను.

మేం బస్సులో యింటికి వస్తూండగా లత అడిగింది "నాన్నా' అంకుల్ రూం సినిమా హాలులాగా అంత చల్లగా ఎలా ఉంది?" అని. నేను, నాకు తెలిసినంతవరకు ఎయిర్‌కండిషనర్ ఎలా పని చేస్తుందో చెప్పాను."... అలా ఆ గదిలో ఉన్న వేడిని ఆ మిషన్ లాగి బయటకి నెట్టేస్తుంది. మనం వస్తుంటే ఎయిర్ కండిషనర్ వెనకాలనుండి వచ్చాం గుర్తుందా? ఎంత వేడిగాలి దాంట్లోంచి వస్తున్నదో గమనించావా?" అన్నాను. లత అదోలా తల ఊపింది. లత మొహంలో ఏదో మార్పు గమనించాను అప్పుడు నేను.

మేం యింటికి వచ్చేంగానే లత సీత దగ్గరకి పరుగెత్తింది. "అమ్మా! అంకుల్‌కి ఎంత పెద్ద ఫ్యాక్టరీ ఉందో తెలుసా? ఎంత మంచి కారు ఉందో తెలుసా? ఎంత పెద్ద ...." అంటూ మొదలు పెట్టింది. "అమ్మా! మరిచిపోయాను. అసలు ఆయన నాన్న దగ్గర కాపీ కొట్టారుట. అయినా సరే ఎంత డబ్బులు సంపాదిస్తున్నారో తెలుసా?" మీరు యిన్నాళ్లు నాకు అబద్ధాలు చెప్పారు అన్న ఫోజు పెట్టి అంది. నేనూ సీతా నవ్వాం. మా నవ్వులు చూసి ఉడుక్కుంది లత. "అసలు ఆ అంకుల్ ఏమీ పనిచెయ్యరు తెలుసా? చాలా మంది ఎంత కష్టపడి పనిచేస్తున్నారో వేడిలో! ఆ అంకుల్ మాత్రం చల్లటి రూంలో కూర్చుంటారు అంతే!" మేం నవ్వులు ఆపలేదు. లత కొనసాగించింది "అసలు ఎవరన్నా సుఖపడాలంటే యింకోళ్లని కష్ట పెట్టాలి".

నేను అప్రతిభుడినయ్యాను. నవ్వు ఆపి లత వంక చూశాను. ఎయిర్ కండిషనర్ ఎలా పని చేస్తుందో విన్నప్పుడు లత మొహంలో కలిగిన మార్పు మళ్లీ చూశాను. అలాగే తల ఊపుతూ అంది "అవును కదూ!" అని.

అవునా? కాదా? ఎయిర్ కండిషనర్ ఎలా పనిచేస్తుంది. మరి? తెలిసో తెలియకో అమాయకత్వం తోనో, ఆరిందాతనంతోనో లత అన్న మాటలలో నిజం లేదా?